## ఈ వారం కథ

# కడుపు తీపి

"అవ్వా, అమ్మ పిలుస్తోంది యింటికి పోదాం రా" అంటూ చెయ్యి పట్టుకు లాగుతూ పిలుస్తున్న మనవడి వంక కోపంగా చూసింది ఆదెమ్మ.

"మీ అమ్మ కాడికి పోయి చెప్పబ్బో, అవ్వ సచ్చిందని."

"పిల కాయలతో ఏం మాటలయ్యి? ఇష్ట దంత విష్టురాలు పడేందుకు నేనేం జేసినా?"

అంత వరకు గోడ చాటున నిలబడి పిల్లల్తో తల్లిని పిలిపిస్తున్న కనలమ్మ ముందుకు వచ్చింది.

కూతుర్ని చూడగానే "వ్వా" అంటూ ముఖం విసురుగా తిప్పకుంటూ అన్నది ఆదెమ్మ" నువ్వేం జేయలేత్తల్లీ. పేయరాని గోరం నేనే జేసినా. నీ బిడ్డల నోటికాడ కూడంతా నేనే తింటుండా నంటినిగా. అది చాలదా? సచ్చే ముసల్దాన్ని నేనేడ పడుంటే మీకేం? ఏడ సత్తే మీకేం. పొండి, పోయి మీరంతా సుఖంగా వుండండి."

"నే నట్టనా అన్నా? పిల కాయలకని రవంత తీసి, అదీ ఎవురో తిరిపెం పెట్టింది ఎత్తి పెట్టినా. పపోళ్ళు! ఆళ్ళకి మనం బెట్టక పోతే ఎవురు బెడ్తారు. పెద్దోల్లం మనం అంత మాత్తరం నోరు గాసుకోలేమా అన్నా. నీ అల్లు డేనన్నా దినమ్మూ పలారాలు జేసేంత తెచ్చి నౌదానబోస్తండాడా ఏవన్నావాళ్ళ ఎవ్వరైనా అంత రాల్చినపుడైనా ఆళ్ళ నోట్లో ఎయ్యక మనం దింటామా అన్నా. అంతేగదా. పాల్చాలు. లేసి యింటికి పద. నేనంగటికి పోవాల. పోతండా. నువ్వింటికి పదు" అంటూ వెళ్ళి పోయింది కనలమ్మ. తల్లి ఆగడం చూస్తుంటే ఆమెకీ కోపంగా వుంది." చేసేదంతా జేసి అలిగొచ్చి దేవళంలో కూసోడం జూడు. నలుగురేమను కొంటారన్న గేనమన్నా వుండొద్దూ?


కన్న తల్లికి కూడు బెట్టగుండా యీదిలోకి తరిమిందన్న పేరుకా?"

మనవడూ, మనవరాలూ కూడా కాసేపు పిలిచి పిలిచి వాళ్ళ సావాస కాళ్ళొచ్చి ఆటలకి పిలవడంతో వెళ్ళిపోయారు.

ఆ రామ మందిరంలో అరుగుమీద ఓ పక్కగా ముసగ దీసుకుని కూచుని వున్న ఆదెమ్మకి మాత్రం కడుపూ, గుండె రెండూ మండుతానే వున్నాయి. ఈ తగువు కంతటికీ కారణమైన దృశ్యం మనసులో మెదిలింది.

పక్కింటి సావిత్రమ్మ వాళ్ళ కొడుకు పుట్టిన రోజని పాయసం చేసింది. అందులోంచి కొంచెం ఓ గ్లాసులో పోసి కనలమ్మ కిచ్చింది. ఇంటిల్లిపాదికీ ఆ గ్లాసుడు పాయసంలో భాగమేం పెడదాంలే అని చిన్న పిల్లలిద్దరికి మాత్రం చెరిసగం చేసిద్దామని ఆ గ్లాసు వంటింట్లో మంచినీళ్ళ బిందె దగ్గర మూత పెట్టి వుంచి బయట పని చూసుకోసాగింది కనలమ్మ.

దాహంవేసి వంటింట్లో కెళ్ళిన ఆదెమ్మ ఆదేం దని మూతదీసి చూసేసరికి నోట్లో నీళ్ళూరాయి.



-అద్దేపల్లి సుచిత్రాదేవి

అయ్యేదవుతదిలే అని ముక్కాలు గ్లాసుడు

